క్లుప్తంగా

ఏటూరునాగారం తహసీల్దార్‌గా సృజన్



ఏటూరునాగారం : మండల తహసీల్దార్‌గా సృజన్ మంగళవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న సంధ్యారాణి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కాగా, వాజేడులో పనిచేస్తున్న సృజన్‌ను ఏటూరునాగారానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

తపాలా సేవలపై అవగాహన

ఏటూరునాగారం : పోస్టాఫీస్ అందజేస్తున్న పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పోస్టాఫీసులో తపాలా సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రామ్మూర్తి మాట్లాడారు. రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన, సేవింగ్ ఖాతా, పోస్టల్ ఇన్సూరెన్స్ వల్ల ప్రజలకు కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ కౌశిక్, ఎంఓ-2 చంద్రశేఖర్, బ్రాంచ్ పోస్టు మాస్టర్ సయ్యద్ వహీద్, కొట్టె పాపారావు, సత్యనారాయణ, రామచంద్రపు సాయి, ఉజమ ఖానం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక




ఏటూరునాగారం : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ కరాటే పోటీలకు మండల కేంద్రానికి చెందిన గొట్టె రాంచరణ్ ఎంపికైనట్లు కోచ్ మాస్టర్ అబ్బు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ విద్యార్థిని మంగళవారం అభినందించి మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న రాంచరణ్ ఇటీవల వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నాడని తెలిపారు. ఆ పోటీల్లో విజయం సాధించి బంగారు పతకం సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత పేర్కొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

వాజేడు : ఈనెల 12న స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు (కోర్టు)ను చైర్మన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఏఈ అర్షద్‌అహ్మద్ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన మీటర్లు మార్చడం, వోల్టేజ్ హెచ్చు, తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన మీటర్ల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరించుట, సర్వీసు పేరు మార్చుట, వాడకంలో హెచ్చు మొత్తంలో గల బిల్లుల చర్చ, కేటగిరి మార్పు, సర్వీసు రద్దు లాంటి సమస్యలు ఉన్న విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి టీఎస్ఎన్‌పీడీసీ నుంచి చైర్‌పర్సన్ వేణుగోపాల చారి, టెక్నికల్ మెంబర్ తిరుమలరావు, ఫైనాన్స్ మెంబర్ చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ నరేందర్ హాజరుఅవుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సన్మానం



చిట్యాల: మండలంలోని దూత్‌పల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఏఆర్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. దీంతో జెడ్పీటీసీ గొర్రె సాగర్, సర్పంచ్ పులి వెంకటేష్ మంగళవారం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సాగర్ మాట్లాడుతూ.. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు నన్నబోయిన మహేష్, శ్రీపతి శ్రీకాంత్, ముక్కెర క్రాంతి పోలీస్ ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

కమిటీ ఎన్నిక



కాటారం: నాయీబ్రాహ్మణ సేవా సంఘం కాటారం డివిజన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజ్జగిరి సమ్మయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ తెలిపారు. అధ్యక్షుడిగా కొయ్యల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా చేరాల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంథని రాజేందర్, ఉపాధ్యక్షుడిగా దామెరకుంట శ్రీకాంత్, కోశాధికారిగా విజ్జగిరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

జోరుగా 'రేషన్' దందా

- పదికి కొని.. ఇరవైకి అమ్మకాలు
- పట్టించుకోని శాఖ అధికారులు
- మిల్లులకు తరలిస్తున్న వైనం



ఎస్ఎస్ తాడ్వాయి : పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొందరు దళారులు రూ.10కి కొని.. రైస్ మిల్లర్లకు రూ.20 చొప్పున అమ్ముతున్నారు. దీంతో మండలంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. దళారులు పేదల బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బియ్యం కొనుగోలు చేసిన రైస్ మిల్లర్లు వాటిని రీసైక్లింగ్ చేసి బ్యాగుల్లో నింపి స్థానికంగా అమ్మడంతో పాటు పక్కరాష్ట్రాలకు కూడా తరలిస్తున్నారు. ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం దళారుల పాలవుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు ఈ దందా కొనసాగుతున్న విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ రేషన్ బియ్యాన్ని దళారులు సొమ్ము చేసుకుంటూ వేలాది రూపాయలు అర్జిస్తున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో ఈ దందా యథేచ్ఛగా సాగుతున్న అధికారులు మాత్రం పట్టింపులేనట్లుగా చూస్తున్నారు. ఈవిషయంపై తహసీల్దార్ తోట రవీందర్‌ను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని ఆర్ఐలతో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా రేషన్ దందా చేయడం చట్ట రీత్యానేరమన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



ములుగు: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ధనసరి సీతక్క

ములుగు : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు ములుగు మండలం, పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత వైఎస్సార్‌ది అన్నారు. పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలు సంతోషాలతో ఉంటారని అన్నారు. టీపీసీసీ సభ్యుడు, మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు భరత్‌కుమార్, పల్లె జయపాల్‌రెడ్డి, షకీల్, మట్టెవాడ తిరుపతి, పోడాల ఓంకాష్, గంధె శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, మొగిలి, బోడ రఘు, ఎల్లావుల అశోక్, శంకరయ్య, విజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రం

వెంకటాపురం(ఎం) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని నల్లగుంటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నల్లగుంటకు చెందిన మాజీ జెడ్పీటీసీ పోతుగంటి సదాశివరెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్కీ సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ చుక్క ప్రభాకర్, ఆధ్వర్యంలో సుమారు 250 మంది ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, చెన్నోజు సూర్యనారాయణ, భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



వాజేడు: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు



వెంకటాపురం(ఎం): మాట్లాడుతున్న రాజు

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని స్థానిక ఎస్సై చల్లా రాజు అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసెంబ్లీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

గ్రామస్తులకు అవగాహన

వాజేడు : మండల పరిధిలోని బొమ్మనపల్లిలో మంగళవారం స్థానిక ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పోలీసులు మాట్లాడుతూ.. సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో గొడవలు పడ వద్దని, గుడుంబా విక్రయించొద్దని ఆయన సూచించారు.

బీఆర్ఎస్‌లో చేరిక



ములుగు : అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎస్ఎస్‌తాడ్వాయి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ పీఏసీఎస్ డైరెక్టర్ పాలకుర్తి రజితరవీందర్, కాటాపురం బీజేపీ వార్డు సభ్యుడు ముత్యాల సతీష్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అభ్యర్థి జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి సమక్షంలో కండువా కప్పుకున్నారు. ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి, ఫైర్ స్టేషన్ మంజూరు చేయించి ప్రారంభించామన్నారు. పోరిక గోవింద్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న రవీందర్

ములుగు రూరల్ : మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో వంట కార్మికులు చేపట్టిన సమ్మె 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. పెంచిన వేతనాలతో పాటు ఏరియర్స్ కార్మికుల ఖాతాల్లో జమచేయాలని అన్నారు. ప్రభుత్వం అల్పాహార కార్యక్రమం ప్రారంభించిన సందర్భంగా కార్మికులకు వంట గిన్నెలు, గ్యాస్ అందించాలని అన్నారు. విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.25కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండి నర్సయ్య, పైడిబాబు, ముత్యాల రాజు, సామల రమ, గున్నాల రాజకుమారి, ప్రమీల, శోభ, ఫర్వీనా, ఉమాదేవి, లలిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న లక్ష్మణ్‌బాబు తదితరులు

ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ బంగారు సూర్యనారాయణ (75) సోమవారం రాత్రి మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు పరామర్శించారు. అనంతరం సూర్యనారాయణ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సీతక్క పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడారం జాతర మాజీ చైర్మన్ రేగ నర్సయ్య, కొర్నెబెల్లి శివయ్య, ఏటూరునాగారం జీసీసీ డైరెక్టర్ పులసం పురుషోత్తం, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, మండల ఉపాధ్యక్షుడు చల్ల రజనీకర్‌రెడ్డి, నాయకులు బంగారు శ్రీరాములు, గంట మనోజ్‌రెడ్డి, గట్టు వంశీ, తాటి దిలీప్, నవీన్, నిఖిల్, అఖిల్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి



ఏటూరునాగారం: నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజు, ఎస్సై కృష్ణప్రసాద్



మంగపేట: మాట్లాడుతున్న ఎస్సై రవికుమార్

- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ఏటూరునాగారం : నవంబర్ 30న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా చూడాలని, అందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సీఐ మండల రాజు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఏ విధంగా పాటించాలో వివరించారు. ఎన్నికలను సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. భారత శిక్షాస్మృతి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఇతర బహిరంగం సభలకు అనుమతి పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణప్రసాద్, రాజకీయ నాయకులు ఉన్నారు.

మంగపేటలో..

మంగపేట : మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నేతలతో స్థానిక ఎస్సై గోదారి రవికుమార్ మంగళవారం ఎన్నికల కోడ్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ నిబంధనలను ఆయా రాజకీయ పార్టీల నేతలకు వివరించారు. ఎన్నికల నియమావళి తప్పక పాటించాలని, ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉడుము అప్పగింత



వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ సెంటర్‌లో గ్రామస్తులు మంగళవారం ఉడుమును పట్టుకున్నారు. పట్టుబడిన ఉడుమును సంబంధిత అటవీశాఖ అధికారి చంద్రమౌళికి గ్రామస్తులు అప్పగించారు. కాగా ఉడుమును అధికారులు సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

పత్తి పంట పరిశీలన

మహదేవపూర్: మండలంలోని రాపెల్లికోట గ్రామంలో పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి మహేష్ మంగళవారం పరిశీలించారు. పత్తి పంటలో తెల్ల దోమ, పచ్చదోమ ఉధృతిని గమనించినట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

సమాన హక్కులు కల్పించాలి

మల్హర్: పేదలకు పంపిణీ చేసిన లావణి పట్టా, సిలింగ్ భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టా భూముల మాదిరిగా సమాన హక్కులు కల్పించాలని ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు మంగళవారం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు బ్యాంకుల రుణం అందడం లేదన్నారు. లావణి పట్టా, సిలింగ్ భూములు సాగు చేస్తున్న నిరుపేద రైతులకు పట్టా భూమితో సమానంగా సమాన హక్కులను కల్పించేలా మేనిఫెస్టో విడుదల చేయాలని శ్రీధర్ బాబును కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కొండ రాజమ్మ, అయిత రాజిరెడ్డి, కేసారపు చంద్రయ్య, తిరుపతిరావు, సదానందం, అశోక్‌రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన ఆశ కార్యకర్తలు



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

ములుగు రూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతు సమ్మె చేసిన ఆశ కార్యకర్తలు ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఇచ్చిన హామీతో సమ్మె విరమించారు. కమిటీ ఏర్పాటు చేసి పరిష్కార మార్గం చూపుతామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండబోయిన రవిగౌడ్, చుంచు మంజుల తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రవీందర్‌కి ఆశ కార్యకర్తలు సమ్మె విరమణ పత్రాన్ని అందజేశారు. తాము చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపిన వారికి ఆశ కార్యకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సరిత, ఈశ్వరి, రమాదేవి, జ్యోత్స్న, రజిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

కాటారం: కాటారం ఉపసర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయిని శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులను ఎంపిక చేయడం తీవ్ర మానసిక క్షోభకు గురైనట్లు తెలిపారు. పార్టీ నాయకుల వైఖరితో క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో రాజీనామా పత్రాన్ని పార్టీ ఇన్‌చార్జికి పంపించనున్నట్లు వివరించారు.

ఏటూరునాగారంలో చోరీ

- రూ.4 లక్షల నగదు..15 తులాల బంగారం, 30 తులాల వెండి
- లబోదిబోమన్న బాధితులు



చిందరవందర పడేసిన సామగ్రి

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నేంద్రకంటి నాగేశ్వర్‌రావు, వాణి దంపతుల ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ.4 లక్షల నగదు, 15 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. నాగేశ్వర్‌రావు తపాలా శాఖ ఉద్యోగి. ఈ క్రమంలో నాగేశ్వర్‌రావుకు జ్వరం రావడంతో ఆదివారం మధ్యాహ్నం భార్య వాణితో కలిసి వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. ఇంటిపై అంతస్తులో విద్యుత్ శాఖ ఉద్యోగి శ్రావణ్‌కుమార్ అద్దెకు ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో అతను తన ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బెడ్రూంలో ఉన్న బీరువా తెరిచి 15 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. అలాగే, పక్కగదిలో నివాసముంటున్న శ్రావణ్‌కుమార్ బీరువాలో ఉన్న రూ. 4 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. శ్రావణ్ మంగళవారం తన రూమ్‌కు రాగా చోరీ జరిగిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో వెంటనే ఇంటి యజమాని నాగేశ్వర్‌రావు, వాణికు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటినా ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నారు. అనంతరం నగదు, బంగారం, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో బోరున విలపించారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న ఎస్సై కృష్ణప్రసాద్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

'కోడ్' వచ్చింది.. రంగు పడింది!



వాజేడు: ప్రధానమంత్రి ఫొటో బోర్డు తొలగిస్తూ..



వాజేడు: ముఖ్యమంత్రి ఫొటో బోర్డును..



వాజేడు: గద్దెకు తెల్ల రంగు వేస్తున్న సిబ్బంది

- గద్దెలకు రంగులు, పార్టీల జెండాలు, బోర్డుల తొలగింపు

వాజేడు : ఎన్నికల కోడ్ రావడంతో గ్రామపంచాయతీ సిబ్బంది రాజకీయ పార్టీల జెండా గద్దెలకు రంగులు వేయడంతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బోర్డులు, నాయకుల ఫొటోలు, జెండాలను తొలగించే పనిలో పడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఉన్న ఫొటోలకు సంబంధించిన బోర్డులను తొలగించారు. పలు పార్టీలకు సంబంధించిన జెండా గద్దెలకు తెల్లరంగు వేశారు.

వెంకటాపురం(కె) : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ వెంటనే అమల్లోకి వచ్చింది. దీంతో మంగళవారం మండలవ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో జీపీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పంచాయతీల్లోని రాజకీయ పార్టీల జెండాలను ఫ్లెక్సీలను తొలగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ తదితర పార్టీల జెండాలు రోడ్లకు ఇరువైపులా ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలు, విద్యుత్ స్తంభాలకు, చెట్లకు ఏర్పాటు చేసిన వాటిని తొలగించారు. అనంతరం తొలగించిన ఫ్లెక్సీలు, జెండాలను గ్రామ పంచాయతీ కార్యాలయాలకు తరలించారు.



వెంకటాపురం(కె): జెండాలు తొలగిస్తూ..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ముసాపూరి రమేష్ (38) ఇటీవల విద్యాదాఘాతానికి గురై వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రమేష్ వారం రోజుల క్రితం తన ఇంటిపై నుంచి ఇనుప పైపు కిందికి దించుతుండగా 33/11కేవీ తీగలకు ప్రమాదవశాత్తు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేష్ భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. రమేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా.. ముసాపూరి రమేష్ మృతదేహం వద్ద మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండీ రాజ్‌మహ్మద్, మాజీ సర్పంచ్ కొక్కుల సదానందం తదితరులు నివాళులర్పించారు.